సాక్షి
పార్వతీపురం మన్యం

మంగళవారం । 30 । ఏప్రిల్ । 2024



వలంటీర్ల రాజీనామా

మక్కువ మండలంలోని 21 పంచాయతీల పరిధిలో 17గ్రామ సచివాలయాలకు 348మంది వలంటీర్లు ఉండగా, సోమవారం 288 మంది వలంటీర్లు రాజీనామా చేశారు. - 8లో



ఎన్నికలకు సహకరించాలి

ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు అభ్యర్థులు, పార్టీలు సహకరించాలని అరకు పార్లమెంట్ నియోజకవర్గం సాధారణ పరిశీలకులు ప్రమోద్ కుమార్ మెహర్దా కోరారు. - 8లో

మే 6న సర్వ సభ్య సమావేశం

గుమ్మలక్ష్మీపురం: మండల ప్రజాపరిషత్ సర్వసభ్య సమావేశం మే 6వ తేదీన ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ జి.జగదీష్ కుమార్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎంపీపీ కుంబురుక దీనమయ్య అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి మండల స్థాయి అధికారులు ప్రగతి నివేదికలతో హాజరు కావాలని కోరారు.

న్యూస్‌రీల్

పోలింగ్ కేంద్రాల పరిశీలన



పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్న ఎన్నికల పరిశీలకుడు ప్రమోద్ కుమార్ మెహర్దా

పార్వతీపురం టౌన్: రానున్న ఎన్నికల నేపథ్యంలో అన్ని పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాట్లు పూర్తి చేయాలని అరకు పార్లమెంట్ నియోజకవర్గం ఎన్నికల పరిశీలకుడు డాక్టర్ ప్రమోద్‌కుమార్ మోహర్దా ఆదేశించారు. ఈ మేరకు సోమవారం ఆయన పార్వతీపురంలోని డీవీఎం మున్సిపల్ ఉన్నత పాఠశాల, కొత్తవలస కేపీఎం, నర్సిపురం ఉన్నత పాఠశాలల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఈ కేంద్రాలలో ఎన్నికల తేదీన ఓటర్లు ఇబ్బందులు పడకుండా ఏర్పాటు చేసిన తాగునీరు, విద్యుత్, ర్యాంపు, తదితర సదుపాయాల గురించి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఏఎస్పీ సునీల్ షేరోన్, తహసీల్దార్ కె.ఆనందరావు, మండల పరిశీలకుడు రామకృష్ణ, బి.సంతోషి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి వేతనదారుకు వడదెబ్బ



అస్వస్థతకు గురైన అక్కమ్మ

సీతానగరం: మండలంలోని బుడ్డిపేట గ్రామానికి చెందిన ఉపాధి వేతనదారు శంకరాపు అక్కమ్మ కోమటి చెరువులో సోమవారం ఉపాధి పనిచేస్తుండగా వడదెబ్బ తగిలి అస్వస్థతకు గురైంది. ఈ మేరకు అక్కమ్మ ఆరోగ్యం పట్ల ఉపాధిహామీ క్షేత్ర సహాయకుడు అప్పలనాయుడు వద్ద ప్రస్తావించగా పెదబోగిలి పంచాయతీ కోమటిపల్లి చెరువులో ఈ వారం పని కల్పించామని, బుడ్డిపేట గ్రామానికి చెందిన అక్కమ్మ పని చేస్తున్న సమయంలో ఎండ తీవ్రంగా ఉన్న కారణంగా అస్వస్థతకు గురైనట్లు తెలియజేశారు. సహచర వేతనదారులు సపర్యలు చేయడంతో ఆరోగ్యం కుదుటపడిందని, కొంత సమయం తరువాత వైద్య సేవలందిచినట్లు చెప్పారు.

పోటీకి సై..

ఏప్రిల్ 18న ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కాగా వారం రోజుల పాటు 25వ తేదీ వరకు నామినేషన్ల స్వీకరణ జరిగింది. నామినేషన్ల పరిశీలన ఏప్రిల్ 26న ముగిసింది. కొన్ని నామినేషన్లు తిరస్కరణకు గురికాగా.. మరికొన్ని నామినేషన్లను 29వ తేదీన ఉపసంహరించుకున్నారు. చివరిగా ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థుల జాబితాను ఆయా నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులు సోమవారం విడుదల చేశారు.

- అరకు లోక్‌సభ స్థానానికి 13 మంది..
- పార్వతీపురం మన్యం జిల్లాలోని నాలుగు అసెంబ్లీ స్థానాలకు 29 మంది బరిలో..

సాక్షి, పార్వతీపురం మన్యం:

ఎన్నికల రణరంగంలో నిలిచేదెవరో.. సార్వత్రిక సంగ్రామ బరిలో పోటీపడేదెవరో తేలిపోయింది. తాడోపేడో తేల్చుకునేందుకు అభ్యర్థులు సిద్ధమైపోయారు. నామినేషన్ల ఉపసంహరణకు సంబంధించి సోమవారంతో గడువు ముగిసింది. పలువురు అభ్యర్థులు తమ నామినేషన్లను ఉపసంహరించుకోవడంతో ఆయా ఆర్వోలు వారి పేర్లను పరిగణనలోకి తీసుకోలేదు. మిగిలిన అభ్యర్థులతో తుది జాబితాను వెల్లడించారు. పార్టీల బీఫారంలు తీసుకున్న వారికి.. ఆయా గుర్తులు కేటాయించారు. మిగిలిన వారికి స్వతంత్ర అభ్యర్థులుగా పరిగణిస్తూ ఎన్నికల సంఘం నిబంధనల మేరకు గుర్తులు కేటాయించారు. ప్రధాన పార్టీల మధ్యే పోటీ ఉండనున్నప్పటికీ... తమ అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు, అమీతుమీ తేల్చుకునేందుకు పలువురు సిద్ధపడి కదనరంగంలోకి దూకుతున్నారు.



పార్వతీపురం నియోజకవర్గం నుంచి నామినేషన్‌ను ఉపసంహరించుకుంటున్న అభ్యర్థి

పార్లమెంట్ బరిలో అభ్యర్థులు..



గుమ్మ తనూజరాణి (వైఎస్సార్‌సీపీ)

అరకు లోక్‌సభ స్థానానికి సంబంధించి 13 మంది బరిలో ఉన్నారు. ఇద్దరు తమ నామినేషన్లను ఉపసంహరించుకున్నారు. అప్పలనర్స పాచిపెంట (భారత కమ్యూనిస్టు పార్టీ- మార్క్సిస్ట్), అవశ్య లహరి (బహుజన సమాజ్ పార్టీ), కొత్తపల్లి గీత (భారతీయ జనతా పార్టీ), గుమ్మ తనూజరాణి (వైఎస్సార్‌సీపీ), చంటి బడ్నాయిన(జై భారత్ నేషనల్ పార్టీ), మొట్టడం రాజబాబు (భారత్ ఆదివాసీ పార్టీ), రాంబాబు జల్లి (తెలుగు రాజాధికార సమితి పార్టీ), వూయక నిరీక్షణ్ (ఇండియా ప్రజాబంధు పార్టీ), అతిథి(స్వతంత్ర), నిమ్మక జయరాజు(స్వతంత్ర), మండల గిరిధరరావు(స్వతంత్ర), రంజిత్‌కుమార్ పాలక(స్వతంత్ర), సమరెడ్డి బాలకృష్ణ(స్వతంత్ర) బరిలో ఉన్నారు.

కురుపాం అసెంబ్లీ స్థానానికి...



పుష్పశ్రీవాణి (వైఎస్సార్‌సీపీ)

కురుపాం అసెంబ్లీ నియోజకవర్గంలో ఏడుగురు అభ్యర్థులు బరిలో నిలిచారు. క్రమ సంఖ్యలో చూసుకుంటే... జగదీశ్వరి తోయక (తెలుగుదేశం), తాడంగి మిన్నారావు (బహుజన సమాజ్ పార్టీ), పాముల పుష్పశ్రీవాణి(వైఎస్సార్‌సీపీ), మండంగి రమణ(భారత కమ్యూనిస్ట్ పార్టీ - మార్క్సిస్ట్), అడ్డాకుల గీతారాణి, తాడంగి శ్రీనివాసరావు, మోసురు నాగభూషణ్(స్వతంత్ర) బరిలో ఉన్నారు.

పాలకొండలో..



విశ్వాసరాయి కళావతి (వైఎస్సార్‌సీపీ)

పాలకొండ నియోజకవర్గంలో ఏడుగురు అభ్యర్థులు పోటీ పడుతున్నారు. వరుస క్రమ సంఖ్యలో చంటిబాబు సవర (జాతీయ కాంగ్రెస్ పార్టీ), విశ్వాసరాయి కళావతి (వైఎస్సార్‌సీపీ), ఊయక భానుచంద్ర (బహుజన సమాజ్ పార్టీ), నిమ్మక కృష్ణ(జాతీయ జనసేన పార్టీ), నిమ్మక జయకృష్ణ (జనసేన), కద్రక జయపాల్ (నవరంగ్ కాంగ్రెస్ పార్టీ), బిడ్డిక ఉమామహేశ్వరరావు(గోండ్వాన దండకారణ్య పార్టీ) ఉన్నారు. నిమ్మక పాండురంగ తన నామినేషన్‌ను ఉపసంహరించుకున్నారు.

పార్వతీపురంలో...

పార్వతీపురం అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి ఎనిమిది మంది బరిలో ఉండగా.. ఇద్దరు తమ నామినేషన్లను ఉపసంహరించుకున్నారు. క్రమ సంఖ్యలో అలజంగి జోగారావు (వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ), కుప్పిలి వెంకట రమణ(బహుజన సమాజ్‌పార్టీ), బత్తిన మోహనరావు (ఇండియన్ నేషనల్ కాంగ్రెస్), బోనెల విజయచంద్ర (తెలుగుదేశం), గుంటా జ్యోతి (జై భీమ్‌రావు భారత్‌పార్టీ), పొట్నూరు కిరణ్‌కుమార్(జై భారత్ నేషనల్ పార్టీ), ఉదయ భాను గర్భాపు, గర్భాపు మోహనరావు (స్వతంత్ర)లు బరిలో ఉన్నారు.



అలజంగి జోగారావు (వైఎస్సార్‌సీపీ)

సాలూరులో..



రాజన్నదొర పీడిక (వైఎస్సార్‌సీపీ)

సాలూరులో ఎనిమిది మందికిగానూ ఒక స్వతంత్ర అభ్యర్థి గేదెల రామకృష్ణ నామినేషన్‌ను ఉపసంహరించుకున్నారు. క్రమసంఖ్యలో గుమ్మిడి సంధ్యారాణి (తెలుగుదేశం), మువ్వల జ్ఞానప్రకాశం (బహుజన సమాజ్‌పార్టీ), మువ్వల పుష్పారావు(భారత జాతీయ కాంగ్రెస్), రాజన్నదొర పీడిక(వైఎస్సార్‌సీపీ), వూసూరు సాయి(సమాజవాదీ పార్టీ), కంచూరి బంగారురాజు, కెల్ల మురళి(స్వతంత్ర) బరిలో ఉన్నారు.

ఎంపీ బరిలో బీజేపీ రెబల్

నిమ్మక జయరాజు



నిమ్మక జయరాజు

టీడీపీ మాజీ ఎమ్మెల్యే, బీజేపీ నుంచి బహిష్కరణకు గురైన నిమ్మక జయరాజు అరకు ఎంపీ బరిలో నిలిచారు. కురుపాం నియోజకవర్గం జియ్యమ్మవలస మండలం వనజ గ్రామానికి చెందిన ఆయన.. తొలుత బీజేపీ నుంచి ఎమ్మెల్యే గానీ, ఎంపీగా గానీ టికెట్ ఆశించారు. అధిష్టానం ఆయనకు మొండిచేయి చూపించింది. కూటమి పొత్తులో భాగంగా కురుపాం అసెంబ్లీ టికెట్‌ను టీడీపీకి చెందిన తోయక జగదీశ్వరికి ఇచ్చారు. అరకు లోక్‌సభ స్థానాన్ని బీజేపీకి చెందిన కొత్తపల్లి గీతకు ఇచ్చారు. గీత ఎస్టీ కాదని, కులవివాదం కేసు ఆమెపై నడుస్తోందని జయరాజు పెద్ద ఎత్తున పోరాటం చేశారు. బహిరంగంగానే తన గొంతు వినిపించారు. అరకు ఎంపీ సీటు తనకే ఇవ్వాలని పట్టుబట్టారు. చివరికి పార్టీ నుంచి బహిష్కరణకు గురయ్యారు. అయినప్పటికీ వెనక్కి తగ్గలేదు. అటు కురుపాం అసెంబ్లీ స్థానంతోపాటు, ఇటు అరకు ఎంపీకీ నామినేషన్ వేశారు. చివరిగా కురుపాం సీటు విషయంలో వెనక్కి తగ్గిన ఆయన.. అరకు ఎంపీ బరిలో నిలిచారు. పోటీకి సై అన్నారు.

చంద్రబాబు గ్యాంగ్‌ను నమ్మితే

రాష్ట్రం అధోగతి

- 2014లో బాబు ఫేక్ హామీలను నమ్మి ప్రజలు ఓటేస్తే నట్టేట ముంచారు
- అబద్ధాలు, గిమ్మిక్కులతో మళ్లీ ఓట్ల కోసం వస్తున్నారు
- దిగ్విజయంగా అమలవుతున్న వైఎస్సార్ సీపీ మేనిఫెస్టోతోనే అభివృద్ధి
- ఉపముఖ్యమంత్రి, రాష్ట్ర గిరిజన శాఖ మంత్రి పీడిక రాజన్నదొర



పీడిక రాజన్నదొర

సాక్షి ప్రతినిధి, విజయనగరం:

అధికారం కోసం అర్రులు చాస్తూ నిస్సిగ్గుగా అబద్ధాలు చెప్పడం చంద్రబాబు సహా టీడీపీ గ్యాంగ్ జన్మహక్కులా ఉందని, వారిని మళ్లీ నమ్మితే రాష్ట్రం గతి అధోగతి పాలవుతుందని ఉపముఖ్యమంత్రి, రాష్ట్ర గిరిజన శాఖ మంత్రి పీడిక రాజన్నదొర అన్నారు. సాలూరులో సోమవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. 'ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ పాలనలో విశాఖ సదస్సు ద్వారా 13.11 లక్ష కోట్ల రూపాయల పెట్టుబడులు వచ్చాయి. తద్వారా 3.47 లక్షల ఉద్యోగాలు రానున్నాయి. అంతకు ముందు చంద్రబాబు 14 ఏళ్ల ముఖ్యమంత్రిగా ఎంత సంపద సృష్టించారో చెప్పమనండి. ఆయన పరిపాలనలోనే రాష్ట్రం కరువులో ఉంద'ని గుర్తు చేశారు. కేంద్ర ప్రభుత్వం భూసంస్కరణల్లో భాగంగా శాశ్వత భూమి హక్కు కల్పించేందుకు సర్వే చేయాలని సూచించిందని, కానీ దాన్ని టీడీపీ వ్యతిరేకిస్తోందని ప్రస్తావించారు. రైతులే తమ భూసమస్యల శాశ్వత పరిష్కారానికి, పటిష్టమైన భూరికార్డుల కోసం భూసర్వే జరగాలని కోరుకుంటున్నారన్నారు. వ్యవసాయ రంగానికి చంద్రబాబు రూ.34,185 కోట్లు మాత్రమే కేటాయిస్తే జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం రూ.55,215 కోట్లు కేటాయించిన విషయాన్ని మరచిపోకూడదన్నారు. గ్రామీణాభివృద్ధికి చంద్రబాబు కేవలం రూ.46,895 కోట్లు మాత్రమే కేటాయిస్తే జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం రూ.92,655 కోట్లు ఖర్చు చేసిందని వివరించారు. ఇలా ఏ రంగం చూసినా చంద్రబాబు కన్నా జగన్‌మోహన్‌రెడ్డే నంబరు ఒన్‌గా ఉన్నారన్నారు. గిరిజన సంక్షేమానికి పెద్దపీట వేశారని చెప్పారు. చంద్రబాబు 2014 ఎన్నికల్లో చెప్పిన ఫేక్ హామీలను నమ్మి ఓట్లేసిన ప్రజలను తీరా అధికారంలోకి వచ్చిన తర్వాత నట్టేటముంచారని విమర్శించారు. అందుకే 2019 ఎన్నికల్లో చారిత్రాత్మకమైన తీర్పుతో చంద్రబాబును హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్ ప్యాలెస్‌కు పరిమితం చేశారన్నారు. ఇప్పుడు మళ్లీ 2024 ఎన్నికల్లో ఓట్ల కోసం ఫేక్ పథకాలను సూపర్ సిక్స్ అంటూ అబద్ధాలు, గిమ్మిక్కులతో చంద్రబాబు గ్యాంగ్ వస్తున్నారని ఎద్దేవా చేశారు. వాటి అమలుకే సుమారు రూ.75వేల కోట్లు ఖర్చు ఉంటుందని, ఆచరణయోగ్యం కాకున్నా అధికార యావతో అన్నీ అమలుచేసేస్తామని చెబుతున్నారని విమర్శించారు. తమ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం గతంలో ఇచ్చిన హామీలన్నీ అమలుచేసిందనీ, ఇకపై కూడా ఆయా పథకాల ద్వారా కలిగే ప్రయోజనాన్ని మరింత పెంచుతూ కొనసాగిస్తామని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి 2024 మేనిఫెస్టో విడుదల చేశారని చెప్పారు. దిగ్విజయంగా అమలవుతున్న ఈ మేనిఫెస్టోతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. అందుకు కళ్ల ముందు కనిపిస్తున్న అభివృద్ధి పనులే నిదర్శనమని రాజన్నదొర చెప్పారు.

వృద్ధులకు ఇంటి వద్దనే పింఛన్లు

పార్వతీపురం: భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు మే 1వ తేదీ నుంచి వృద్ధులు, దివ్యాంగులు, తీవ్ర అనారోగ్యంతో బాధపడేవారికి ఇంటి వద్దనే పింఛన్లు అందజేస్తామని కలెక్టర్ నిషాంత్ కుమార్ సోమవారం తెలిపారు. మిగిలిన వారికి బ్యాంకు ఖాతాల్లో జమచేస్తామన్నారు. ఏ ఒక్కరూ పింఛన్ కోసం సచివాలయాల వద్దకు రావద్దని సూచించారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళికి లోబడి పింఛన్లు పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకున్నామని పేర్కొన్నారు.


అతివలకు ఆర్థిక భరోసా

స్త్రీలు కుటుంబాలను నిర్మిస్తారు. కుటుంబాలు గృహాలను నిర్మిస్తాయి, ఇళ్లు సమాజాలను తయారుచేస్తాయి సమాజం దేశాన్ని సృష్టిస్తుంది. స్త్రీల సహకారం ప్రతిచోటా ఉంటుంది. ఒక స్త్రీకి విద్యనందిస్తే, ఓ తరానికి విద్య అందుతుంది. స్త్రీ ఆర్థిక స్వావలంబన కలిగి ఉంటే కుటుంబ జీవనం ఒడిదొడుకులు లేకుండా సాగిపోతుంది. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని రాష్ట్రప్రభుత్వం మహిళలు ఆర్థికంగా స్వావలంబన సాధించేందుకు వివిధ పథకాలు అమలు చేస్తూ కొండంత అండగా నిలుస్తోంది.

- కుటీర పరిశ్రమలు, దుకాణాల నిర్వహణకు తోడ్పాటు
- సంక్షేమానికి కృషి చేసిన ప్రభుత్వం
- మెరుగుపడిన జీవన ప్రమాణాలు

పార్వతీపురంటౌన్:

మహిళల సంక్షేమానికి జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తోంది. 'నవరత్నాలు' అమలులో మహిళలకు పెద్దపీట వేసింది. వైఎస్సార్ సున్నా వడ్డీ పథకం, వైఎస్సార్ చేయూత, వైఎస్సార్ ఆసరా తదితర పథకాలతో పాటు పరిశ్రమల ఏర్పాటుకు ప్రత్యేక ప్రోత్సాహకాలు, రాయితీలు అందిచింది. ఐదేళ్లుగా వివి ధ పథకాల కింద ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సాయాన్ని మహిళలు సద్వినియో గం చేసుకుంటున్నారు. కుటీర పరిశ్రమలు, కిరాణా దుకాణాలు, డెయిరీఫాంలు నిర్వహిస్తూ ఆర్థికోన్నతి చెందుతూ కుటుంబానికి అండగా నిలుస్తున్నారు. పార్వతీపురం మన్యం జిల్లా వ్యాప్తంగా గ్రామీణాభివృద్ధి శాఖ పరిధిలో మొత్తం 19,528 స్వయం సహాయక సంఘాల్లోని 2,25,667 మంది మహిళలకు బ్యాంకుల ద్వారా ఆర్థిక సహాయం అందుతోంది.



వైఎస్సార్ ఆసరా చెక్కువిడుదల చేస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి (ఫైల్)



రూ.947.94 కోట్ల బ్యాంకు లింకేజీ రుణాలు

మహిళా సాధికారతే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తుండగా, దానికి బ్యాంకులు తోడ్పాటునందిస్తున్నాయి. బ్యాంకు లింకేజీ ద్వారా 2022-23 ఆర్థిక సంవత్సరానికి ఈ ఏడాది సెప్టెంబర్ 30 నాటికి స్వయంసహాయక సంఘాల పరిధిలో ఉన్న 2,60,500 మంది లబ్ధిదారులకు రుణ పంపిణీ లక్ష్యం కాగా, 2,48,419 మంది మహిళలకు రూ.947.94 కోట్లమే ర రుణాలను నేరుగా వారి గ్రూపు ఖాతాల్లో జమ చేశారు. స్త్రీనిధి పథకం కింద 16,496 మంది స్వయం సహాయక సంఘాల సభ్యులకు రుణ పంపిణీ లక్ష్యం కాగా 15,200 మందికి రూ.2.20 కోట్లు అందించారు.

సున్నా వడ్డీ భరోసా..



మహిళలకు ఆర్థిక భరోసా కల్పించేందుకు వైఎస్సార్ సున్నా వడ్డీ పథకం ద్వారా జిల్లాలోని 2,24,589 మంది మహిళల ఖాతాల్లో రూ.30.50 కోట్ల మేర వడ్డీరాయితీని జమ చేసింది. దిగువ, మధ్యతరగతి మహిళల ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా బ్యాంకులతో పాటు మల్టీ నేషనల్ కంపెనీలతో ఒప్పందాలు కుదుర్చుకుని వ్యాపారం, స్వయం ఉపాధి రంగాల్లో ప్రోత్సహిస్తోంది. క్రమం తప్పకుండా బ్యాంకు రుణాలు తీసుకున్నవారి వడ్డీ రాయితీని ప్రభుత్వమే భరిస్తోంది. అలాగే, వైఎస్సార్ ఆసరా పథకం కింద ఆర్థిక సహకారం అందించడంతో పాటు వ్యాపార రంగంలో రాణించేలా సాంకేతిక పరిజ్ఞానంపై శిక్షణ ఇప్పిస్తోంది. 45-60 ఏళ్ల మధ్య వయస్సు గల ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ వర్గాల మహిళలకు ఏటా రూ.18,750 చొప్పున నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తూ ఐళ్లలో రూ.75 వేలు ఆర్థిక సాయం చేసింది.

పొదుపు మహిళల రుణ మాఫీ			
విడతలు	సంఘాలు	సభ్యులు	చేకూరిన లబ్ధి (రూ.కోట్లలో)
మొదటి విడత	16,695	1,92,694	11.05
రెండవ విడత	18,868	2,15,165	10.66
మూడవ విడత	20,223	2,30,676	13.68
నాల్గవ విడత	20,223	2,34,256	23.18

వైఎస్సార్ ఆసరా			
విడత	సంఘాల సంఖ్య	సభ్యుల సంఖ్య	లబ్ధి(రూ.కోట్లలో)
మొదటి	16,534	1,86,192	93.52
రెండవ	16,646	1,88,069	94.32
మూడవ	16,646	1,83,077	94.32
నాల్గవ	16,652	1,83,081	94.33

చేయూత		
విడత	లబ్ధిదారులు	చేకూరిన లబ్ధి (రూ. కోట్లలో)
మొదటి విడత 2020	61,498	120.80
రెండవ విడత 2021	75,290	115.29
మూడవ విడత 2022	64,433	177.25
నాల్గవ విడత 2023	75,290	141.16

మంచి అన్న దొరికాడు



మహిళలందరినీ ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి అన్నలా ఆదుకున్నారు. టైలరింగ్ పనిప్రారంభించాను. వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా నాలుగు విడతల్లో రూ.35,700 వచ్చింది. వ్యాపారం ఆశాజనకంగా నడుస్తోంది. సకాలంలో రుణం చెల్లిస్తున్నాను. ప్రస్తుతం నెలవారీ రూ.6 వేల నుంచి 8 వేల వరకు ఇంటివద్దనే ఉంటూ సంపాదిస్తున్నాను. జగనన్నకు ధన్యవాదాలు.

–బొంగు అనూష, చినబొండపల్లి, పార్వతీపురం మండలం

'మహిళలకు పెద్దపీట



మహిళలకు పెద్దపీట వేస్తున్న ముఖ్యమంత్రి జగనన్న రుణం ఎన్ని జన్మలెత్తినా తీర్చుకోలేం. కరోనా కష్టాల్లో గతంలో తీసుకున్న బ్యాంకు రుణాలు కట్టేందుకు ఇబ్బందులు పడ్డాం. వైఎస్సార్ సున్నా వడ్డీ పథకం కింద వడ్డీని ప్రభుత్వమే భరించింది. వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా రూ.30వేలు లబ్ధిపొందాను. ఆ డబ్బుతో టైలరింగ్ షాపు పెట్టుకున్నాను. ఆర్థికంగా నిలదొక్కుకుంటున్నాను.

–ఝాన్సీలక్ష్మి, కృష్ణపల్లి గ్రామం

మహిళలకు కొండంత అండ



మహిళలకు బ్యాంకు లింకేజీతో పాటు సున్నా వడ్డీ పథకం రాయితీ, వైఎస్సార్ చేయూత, వైఎస్సార్ ఆసరా వంటి పథకాల ద్వారా ప్రభుత్వం ఆర్థికంగా కొండంత అండగా నిలిచి మాలో ఆత్మస్థైర్యం నింపింది. పొదుపు మహిళలు ఆర్థికాభివృద్ధి చెందాలన్న ఉద్దేశంతో సంక్షేమ పథకాలన్నింటిలోనూ మహిళలను ప్రధాన లబ్ధిదారులుగా ప్రభుత్వం ఎంపిక చేసింది.

–బోనెల పద్మ, గోపాలపురం గ్రామం

క్లుప్తంగా

వేసవి శిక్షణ శిబిరం ప్రారంభం



పుస్తక పఠనం చేస్తున్న విద్యార్థులు

గరుగుబిల్లి: రాష్ట్ర పౌరగ్రంథాలయశాఖ సంచాలకుడు ప్రసన్నకుమార్ ఉత్తర్వుల మేరకు ఉమ్మడి విజయనగరం జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి బోనెల లక్ష్మి ఆదేశాల మేరకు మండల కేంద్రంలోని శాఖా గ్రంథాలయంలో సోమవారం వేసవి విజ్ఞాన శిబిరం ప్రారంభించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు జూన్ 11 వరకు ప్రభుత్వం వేసవి సెలవులు ప్రకటించిన నేపథ్యంలో ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల కోసం ఈ వేసవి విజ్ఞాన శిబిరాన్ని నిర్వహించనున్నట్లు గ్రంథాలయ నిర్వాహకుడు ఎస్. మధుసూదనరావు తెలిపారు. విద్యార్థులు కథలు వినడం, పుస్తకపఠనం, పుస్తక సమీక్ష, ఆటల పోటీలు తదితర కార్యక్రమాలను ప్రతిరోజూ ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు నిర్వహించనున్నట్లు చెప్పారు.

రేపటి నుంచి ప్రాక్టికల్ పరీక్షలు

పార్వతీపురంటౌన్: 2024 ఫిబ్రవరిలో జరిగిన జనరల్, ఒకేషనల్ ప్రాక్టికల్ పరీక్షల్లో ఫెయిల్ అయిన, హాజరు కాని విద్యార్థులకు మే 1 బుధవారం నుంచి ప్రాక్టికల్స్ నిర్వహించనున్నట్లు జిల్లా వృత్తివిద్యాశాఖాధికారిణి జి. మంజులావీణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జనరల్ కోర్సులకు సంబంధించి బోటనీ, జువాలజీ, ఫిజిక్స్, కెమిస్ట్రీ ప్రాక్టికల్స్‌ను పార్వతీపురంలోని వాసవి జూనియర్ కళాశాలలో నిర్వహించనున్నట్లు చెప్పారు. అలాగే ఒకేషనల్ ప్రాక్టికల్స్‌కు సంబంధించి ఎంపీహెచ్‌డబ్ల్యూ.ఎంఎల్‌టీ, ఎల్‌ఎంఅండ్‌డీ గ్రూపులకు వేదశ్రీ ఒకేషనల్ జూనియర్ కళాశాలలో, ఓఏఎస్, ఈటీ గ్రూపులకు సాలూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో, ఎంఅండ్‌ఏటీ, ఫిషరీష్, సీఈటీ గ్రూపులకు చినమేరంగి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో, సీపీఅండ్‌ఎం గ్రూపునకు కురుపాం కేటీఆర్ ఒకేషనల్ జూనియర్ కళాశాలలో, సీఎస్ఈ గ్రూపునకు పాలకొండ ప్రభుత్వ జూనియర్ కళాశాల (బాలుర) కేంద్రంలో ప్రాక్టికల్స్‌కు కేటాయించామన్నారు. ఆయా కళాశాలలకు విద్యార్థులు హాజరు కావాలని సూచించారు.

గుడివాడలో సాలూరు యువకుడి మృతి

సాలూరు రూరల్: కృష్ణా జిల్లా గుడివాడ పట్టణంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో సాలూరు మండలంలోని కొట్టుపరువు గ్రామానికి చెందిన చింతాడ అజయ్(30) మృతిచెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం..గుడివాడ పట్టణంలో ఓ చేపల చెరువులో పనిచేస్తున్న అజయ్ ద్విచక్రవాహనంపై వెళ్తుండగా కారు ఢీకొనడంతో ప్రాణాలు కోల్పోయాడు. మృతుడికి తల్లి బుచ్చమ్మ, తండ్రి ప్రకాశ్, చెల్లి ఉన్నారు.

గిరిజన సమస్యల పరిష్కారం



గ్రంథాలయంలో పుస్తకాలను పరిశీలిస్తున్న ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ డీవీజీ శంకరరావు

రాజాం: గిరిజన సమస్యల పరిష్కారంలో ఎస్టీ కమిషన్ చురుగ్గా పనిచేస్తోందని కమిషన్ చైర్మన్ డాక్టర్ డీవీజీ శంకరరావు తెలిపారు. రాజాం పట్టణం కంచరవీధిలో పారిశ్రామికవేత్త పొట్నూ సత్యనారాయణగుప్త ఇంటి వద్ద ఏర్పాటుచేసిన గ్రంథాలయాన్ని ఆయన సోమవారం పరిశీలించారు. పలు ప్రాచీన గ్రంథాలు, పుస్తకాలపై ఆరా తీశారు. అనంతరం స్థానిక విలేకరులతో మాట్లాడారు. 2021 నుంచి ఎస్టీ కమిషన్‌కు వచ్చిన సమస్యలను పరిష్కరిస్తున్నట్టు వెల్లడించారు. అటవీ హక్కుల చట్టం పక్కాగా అమలవుతోందన్నారు. గిరిజన అక్షరాస్యత పెంపునకు చేపట్టిన చర్యలు సత్ఫలితాలిచ్చాయన్నారు.

ఎర్రటి ఎండలోనూ..

• ప్రజలతో మమేకం • జోరుగా ఎమ్మెల్యే అభ్యర్థుల ప్రచారం

ప్రచార పర్వం

సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో బరిలో ఉన్న ఎమ్మెల్యే అభ్యర్థులు ప్రచారంలో దూసుకుపోతున్నారు. ఎర్రటి ఎండను ఖాతరు చేయకుండా నియోజకవర్గంలోని గ్రామాలకు వెళ్తూ ఎన్నికల్లో తమను గెలిపించాలని అభ్యర్థిస్తున్నారు.



కురుపాం: మధురానగరం గ్రామంలో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ఎమ్మెల్యే అభ్యర్థి పాముల పుష్పశ్రీవాణి



పార్వతీపురం టౌన్: పార్వతీపురంలోని 15వ వార్డులో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ఎమ్మెల్యే జోగారావుకు హారతి ఇచ్చి తలపై పూలు జల్లి ఆశీర్వదిస్తున్న మహిళ



సాలూరు: మండలంలోని రెయ్యివాని వలసలో ఎన్నికల ప్రచారంలో పాల్గొని చిన్నారిని ఎత్తుకున్న వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పీడిక రాజన్నదొర



వీరఘట్టం మండలం వండువలో ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ పాలకొండ ఎమ్మెల్యే అభ్యర్థి విశ్వాసరాయి కళావతి

బలపడుతున్న వైఎస్సార్‌సీపీ



పాలకొండ రూరల్: టీడీ.పారాపురంలో పలువురిని పార్టీలోకి ఆహ్వానిస్తున్న పాలకండ ఎమ్మెల్యే అభ్యర్థి విశ్వాసరాయి కళావతి

• అధికార పార్టీలో కొనసాగుతున్న చేరికలు

పార్వతీపురంటౌన్:

రోజురోజుకూ ప్రతిపక్షాల కూటమి బలహీనపడుతుండగా రాష్ట్రంలో అధికార వైఎస్సార్‌సీపీ బలపడుతోంది. అధికార పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిపై ప్రజలకు విశ్వాసం అంచెలంచెలుగా పెరుగుతోంది. ఈ నేపథ్యంలో సోమవారం పార్వతీపురం పట్టణంలోని 15వ వార్డు, 13వ వార్డులకు చెందిన పలువురు టీడీపీ నాయకులు వైఎస్సార్‌సీపీ కండువాలు వేసుకుని పార్టీలో చేరారు, వారందరినీ వైఎస్సార్‌సీపీ పార్వతీపురం ఎమ్మెల్యే అభ్యర్థి అలజంగి జోగారావు సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో ప్రధానంగా గొట్ట కుమార్, జమ్ము అప్పలరాజు, దేవుపల్లి నందబాబు వారికి చెందిన కుటుంబాలు ఉన్నాయి. కార్యక్రమంలో ఏపీ టిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్, రాష్ట్ర మహిళా కమిషన్ మాజీ సభ్యురాలు కొయ్యన శ్రీవాణి, పార్టీ పట్టణ అధ్యక్షుడు కొండపల్లి బాలకృష్ణ, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ మంత్రి రవికుమార్, స్థానిక కౌన్సిలర్లు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పాలకొండ రూరల్‌లో..

పాలకొండ రూరల్: మండలంలోని టీడీ.పారాపురం గ్రామానికి చెందిన టీడీపీ సానుభూతిపరులు వంజరాపు అప్పారావు, వంజరాపు సాయి, కెంబూరి శేఖర్, అలుగోలు రాంబాబులతో పాటు మరికొన్ని కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో సోమవారం చేరాయి. ఇంటింటి ప్రచారంలో భాగంగా ఆ గ్రామంలో పర్యటించిన వైఎస్సార్‌సీపీ పాలకొండ ఎమ్మెల్యే అభ్యర్థి విశ్వాసరాయి కళావతి సమక్షంలో వారు పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. వారికి ఆమె పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో కళావతి గెలుపే లక్ష్యంగా తామంతా పనిచేస్తామని పార్టీలో చేరిన వారు ఈ సందర్భంగా స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ బొమ్మాళి భాను, వైస్‌ఎంపీపీలు కణపాక సూర్యప్రకాశ్, వాకముడి అనిల్‌కుమార్, సర్పంచులు శివ్వాల శ్రీనివాసరావు, గోగుల కల్యాణి, డొకర వెంకటనాయుడు తదితరులు పాల్గొన్నారు.



పార్వతీపురం టౌన్: వైఎస్సార్‌సీపీలో చేరిన 15వ వార్డు టీడీపీ నాయకులు



పార్వతీపురం టౌన్: 13వ వార్డు టీడీపీ నాయకులు

ప్రశాంత ఎన్నికలకు సహకరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న పార్లమెంట్ నియోజకవర్గం సాధారణ పరిశీలకుడు ప్రమోద్ కుమార్ మెహర్దా, కలెక్టర్ నిషాంత్‌కుమార్

• పార్లమెంట్ నియోజకవర్గ సాధారణ పరిశీలకుడు ప్రమోద్ కుమార్ మెహర్దా

పార్వతీపురం: ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు పోటీలో ఉన్న అభ్యర్థులు, పార్టీలు సహకరించాలని అరకు పార్లమెంట్ నియోజకవర్గం సాధారణ పరిశీలకులు ప్రమోద్ కుమార్ మెహర్దా కోరారు. ఎన్నికల తుది పోటీ జాబితాలో ఉన్న అభ్యర్థులు, వారి ప్రతినిధులు, రాజకీయ పార్టీల అభ్యర్థులతో సోమవారం ఆయన కలెక్టరేట్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ, ప్రైవేట్ ప్రదేశాలలో ఎన్నికల ప్రచార రాతలు ఉండరాదని, ప్రచారంలో అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని, ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పక్కాగా పాటించాలని సూచించారు. కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి, అరకు పార్లమెంట్ నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి నిషాంత్ కుమార్ మాట్లాడుతూ ప్రచారంలో ఆయా అభ్యర్థులు వారి ప్రచారానికి మాత్రమే కట్టుబడి ఉండాలన్నారు. ప్రచారానికి ముందస్తు అనుమతి ఉండాలని స్పష్టం చేశారు. ఒకే తేదీ, ఒకే సమయంలో అనుమతులు ఇవ్వబోమని చెప్పారు. ఎక్కడా నియమాల ఉల్లంఘన ఉండరాదని, ఒకరిపై ఒకరు దూషణలు, హింస చెలరేగే విధంగా ప్రచారం ఉండరాదని పేర్కొన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అల్లూరి సీతారామరాజు జిల్లాలో భౌగోళిక పరిస్థితుల నేపథ్యంలో పాడేరు, అరకు, రంపచోడవరంలలో అనుమతులు పొందేందుకు అవకాశం కల్పించామని చెప్పారు.

ఏఎస్ఆర్ జిల్లాలో సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్

అల్లూరి సీతారామరాజు జిల్లాలో పరిస్థితుల దృష్ట్యా పోలింగ్ ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 4 గంటలు వరకు మాత్రమే జరుగుతుందని అరకు పార్లమెంట్ నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి నిషాంత్ కుమార్ తెలిపారు. ఆ జిల్లాలో ఎన్నికల ప్రచారం మే 11వ తేదీ సాయంత్రం 4 గంటలతో ముగుస్తుందని చెప్పారు. పార్వతీపురం మన్యం జిల్లాలోని పాలకొండ, కురుపాం, సాలూరు నియోజక వర్గాల పరిధిలో పోలింగ్ ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు, పార్వతీపురం నియోజక వర్గంలో ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటలు వరకు జరుగుతుందన్నారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి జి కేశవ నాయుడు, వివిధ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

మూకుమ్మడిగా వలంటీర్ల రాజీనామా



ఎంపీడీవో దేవకుమార్‌కు రాజీనామాపత్రాలు అందిస్తున్న వలంటీర్లు

• ఎంపీడీవోకు పత్రాలు అందజేసిన 288మంది

మక్కువ: మండలంలోని 21పంచాయతీల పరిధిలో 17గ్రామ సచివాలయాలకు 348మంది వలంటీర్లు ఉండగా, సోమవారం ఒక్కరోజే 288మంది వలంటీర్లు రాజీనామా చేశారు. ఆయా గ్రామ సచివాలయాల నుంచి వలంటీర్లు ఆటోల్లో స్థానిక మండల పరిషత్ కార్యాలయానికి చేరుకుని, స్వచ్ఛందంగా రాజీనామా పత్రాలను ఎంపీడీవో పి.దేవకుమార్‌కు సమర్పించారు. ఈ సందర్భంగా వలంటీర్లు విలేకరులతో మాట్లాడుతూ లబ్ధిదారులకు సేవలందించేందుకు అవకాశంలేకుండా టీడీపీ నాయకులు చేయడం వల్ల, తామంతా మూకుమ్మడిగా రాజీనామా చేశామన్నారు. గతంలో పలుమార్లు టీడీపీ నాయకులు వలంటీర్ వ్యవస్థను కించపరిచారని ఆందోళన వ్యక్తం చేశారు. టీడీపీ అధికారంలోకి వస్తే వలంటీర్లకు రూ.10వేల వేతనం అందిస్తామని ప్రకటించినప్పటికి, వలంటీర్లు నమ్మే పరిస్థితి లేదన్నారు. సోమవారం 288మంది వలంటీర్లు రాజీనామా చేయగా, మిగిలిన 60మంది ఒకటి, రెండు రోజుల్లో రాజీనామా చేసేందుకు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. అనంతరం వారంతా వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు మావుడి రంగునాయుడిని మర్యాదపూర్వకంగా కలిశారు.



రంగునాయుడిని కలిసిన వలంటీర్లు

టీడీపీ నాయకుల మాటలు నమ్మం



టీడీపీ అధికారంలోకి వస్తే వలంటీర్ వ్యవస్థను కొనసాగించడంతోపాటు, రూ.10వేలు అందిస్తామని ప్రకటించినప్పటికీ, ఆ పార్టీ నాయకుల మాటలు నమ్మేందుకు వలంటీర్లు సిద్ధంగా లేరు. అందువల్ల మూకుమ్మడిగా రాజీనామా చేశాం. వైఎస్.జగన్‌మోహన్ రెడ్డి వలంటీర్ వ్యవస్థను ఏర్పాటుచేసి, ప్రజలకు సేవచేసేందుకు మాకు అవకాశం కల్పించారు. టీడీపీ నాయకులు వలంటీర్ వ్యవస్థపై లేనిపోని ఆరోపణలుచేసి, అసత్యప్రచారం చేశారు. ఎన్నికల కోడ్ సాకుగా చూపించి, వలంటీర్లు ప్రజలకు సేవచేయకుండా టీడీపీ నాయకులు అడ్డుతగిలారు.

శంబంగి సత్యవతి, బంగారువలస గ్రామం

జగన్ ప్రభుత్వంలో వలంటీర్లుగా కొనసాగుతాం



వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వస్తే, మళ్లీ మేమంతా వలంటీర్లుగా కొనసాగేందుకు సిద్ధంగా ఉన్నాం. జగన్‌మోహన్‌రెడ్డిని రెండవసారి ముఖ్యమంత్రిగా గెలిపించుకునేందుకు కష్టపడతాం. అయిదేళ్ల వలంటీర్‌గా వేతనం కోసం పనిచేయలేదు. జగనన్న నవరత్నాల పథకాల ద్వారా లబ్ధిదారులకు సంక్షేమపథకాలు అందిస్తుంటే, వారి ముఖంలో చిరునవ్వులు చూశాం. అది మాకు ఎంతో సంతోషాన్ని ఇచ్చింది.

ఊటపల్లి సరోజిని, పనసభద్ర గ్రామం

మరో ఐదేళ్లూ అన్నదాతకు దన్ను

• రైతు భరోసా రూ.13,500 నుంచి రూ.16 వేలకు పెంపు

సాక్షి, పార్వతీపురం మన్యం: విత్తు నుంచి విక్రయం వరకు రైతును చేయి పట్టి నడిపిస్తున్న ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి.. ఎన్నికల మేనిఫెస్టో-2024లో అన్నదాత సంక్షేమానికి మరింత పెద్దపీట వేశారు. గడిచిన ఐదేళ్ల కాలంలో రైతుకు అన్ని విధాలా అండగా నిలిచిన ఆయన.. అందుకోసం కోట్లాది రూపాయలు ఖర్చు చేశారు. రాబోయే ఐదేళ్లలో మరింత వెన్నుదన్నుగా నిలవబోతున్నట్లు తాజా మేనిఫెస్టో ద్వారా భరోసా ఇచ్చారు. వచ్చే ఐదేళ్లలో రైతు సంక్షేమం కోసం మరిన్ని కార్యక్రమాలు అమలు చేస్తామని అన్నదాతకు భరోసా ఇచ్చారు. రైతు భరోసా ప్రస్తుతం ఏడాదికి రూ.13,500 అందజేస్తుండగా దాన్ని రూ.16,00కు పెంచుతూ మేనిఫెస్టో విడుదల చేశారు.



ముఖ్యమంత్రికి రుణపడి ఉంటాం



వ్యవసాయాన్నే నమ్ముకున్న మాలాంటి రైతులకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అన్ని విధాలా అండగా నిలిచారు. నేను యంత్ర సేవ కింద రూ.2.30 లక్షల మేర లబ్ధి పొందాను. గత ఎన్నికల్లో చెప్పినవే కాకుండా రైతుల కోసం చాలా చేశారు. ఇప్పుడు మేనిఫెస్టో మాలాంటి వారికి మరింత మేలు చేస్తుంది. ఆయనకు ఎల్లప్పుడూ రుణపడి ఉంటాం.

– పి.సింహాచలం నాయుడు, వెంకంపేట, పార్వతీపురం

రైతు కష్టం తెలిసిన నాయకుడు



రైతు బాంధవుడు రాజన్న కుమారుడు, కర్షకుల కష్టం తెలిసిన నాయకుడు. పాదయాత్ర సందర్భంగా జగన్‌మోహన్‌రెడ్డి మా ప్రాంతానికి వచ్చినప్పుడు మా కష్టాలను ఏకరువు పెట్టాం. అప్పుడే రైతులకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చిన ఏడాది నుంచే రైతు భరోసా పేరిట పెట్టుబడిసాయం అందించారు. ఎన్ని కష్టాలు ఎదురైనా అన్నదాత బ్యాంకు ఖాతాలకు నేరుగా ఈ మొత్తాలు చేర్చిన ఘనత ఆయనదే. ఐదు విడతల్లో రైతు భరోసా లబ్ధి పొంది వ్యవసాయం చేశాను. అన్నదాతలను ఆదుకునేందుకు ఈ దఫా మెనిఫెస్టోలో ఈ రైతు భరోసా రూ.16వేలకు పెంచుతూ తీసుకున్న నిర్ణయం హర్షణీయం.

– మజ్జి సూర్యనారాయణ, రైతు, చినమంగళాపురం, పాలకొండ మండలం